ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబరు, 2025
5
శ్రీకాకుళం



వృత్తి విద్యా నైపుణ్యాల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం సిటీ/పొందూరు: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి వృత్తి విద్యా నైపుణ్య ప్రతిభ సెమినార్‌లో పొందూరు మండలం లోని ఎపి మోడల్ స్కూల్, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. అప్పారెల్ ట్రేడ్ విభాగంలో జిల్లాస్థాయిలో మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. ఎపి మోడల్ స్కూల్ ఒకేషనల్ ఉపాధ్యాయులు సీపాన మాలతి పర్యవేక్షణలో విద్యార్థులు హిమవర్ష, సింధు, మృదులలు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఈనెల 14న అమరావతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఒకేషనల్ ఉపాధ్యాయులు దుంపల విజయలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులు మధురిమ, శ్రీవన్య, షేక్ సల్మా, ఉమామహేశ్వరిలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు సమసగ్ర శిక్ష అభియాన్ ఎపిసి శశిభూషణ్ అభినందించారు.

నాడు ఆదర్శం... నేడు నిర్లక్ష్యం

ఆడవిని తలపిస్తున్న విజయాదిత్య పార్కు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వం పార్కులు నిర్వహిస్తుంది. టూరిజం ప్రగతికి ప్రాధాన్యత నిస్తున్నట్లు చెబుతుంది. జాతీయ రహదారికి అనుకొని శ్రీకాకుళం నగర పాలక సంస్థ సమీపంలో సీపన్నాయుడుపేట వద్ద విజయ ఆదిత్య పార్కు నిర్వహణ లేక అధ్వానంగా ఉంది. ఈ పార్కును నిర్వహించడం లేదు. ప్రస్తుతం సంఘ వ్యతిరేఖ కార్యక్రమాలకు అడ్డాగా ఈ పార్కు మారింది. 2004లో ఈ పార్కును ఏర్పాటు చేశారు. హైవే విస్తరణ సమయంలో ఇక్కడ ఉన్న ప్రభుత్వ స్థలం, చెరువును పార్కుగా తీర్చిదిద్దారు. బోటు షికారు, క్యాంటిట్ వంటివి నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణం, చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చేవారు. టూరిజంశాఖ నిర్వహించేది. ప్రభుత్వానికి ఆదాయం సైతం వచ్చేది. పూర్తిగా ప్రస్తుతం నిర్వహణ లేక విడిచి పెట్టారు. హుదూద్, తిత్లీ వంటి తుపానులు నేపథ్యం పార్కులో చెట్లు కూలి పోవడంతో నిర్వహణ పక్కన పెట్టారు. అనంతం మళ్లీ టెండర్లు పిలిచి ఇటీవల మరమ్మతులు చేశారు. అంతర్గత రోడ్డులు నిర్మాణం చేపట్టారు. క్యాంటీన్ భవనానికి మరమ్మతులు చేశారు.



విజయాదిత్య పార్కు ముఖద్వారం



నిరుపయోగంగా క్యాంటీన్ భవనం

తరువాత వదిలేశారు. గతంలో నిరంతరం పార్కు సందర్శకలతో రద్దీగా ఉండేది. మోటార్, మాన్యువల్ బోట్లుతో రద్దీగా ఉంటేడి. పార్కు సహజ సిద్దంగా ఉండటంతో చెరువు, చుట్టు అంతర్గత రోడ్డు, మధ్యలో పిల్లలు అడుకునేందుకు, వ్యాయామనం చేసేందుకు అనుకూలంగా పలు ఐటమ్‌లు ఏర్పాటు చేశారు. పార్కుకు వందల్లో సందర్శకులు వచ్చేవారు. తక్కువ కాలంలో పార్కుకు గుర్తింపు వచ్చింది. అటు వంటి పార్కును నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా విడిచిపెట్టారు, ప్రస్తుతం పిచ్చి మొక్కలు, చెరువు మధ్యలో చెట్లు ఆవరించాయి. అలాగే క్యాంటీన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఫుట్‌పాత్ టైల్స్ పాడవుతున్నాయి. నిర్వహణ లేక నిరుపయోగంగా పడి ఉన్నారు. గతంలో ఈ చెరువులో బోట్లు నడపటం, చేపలు పెంచటం చేసేవారు. చెరువులో పిచ్చి మొక్కలు, తూటిక తివ్వ పెరగటం వల్ల నీరు సైతం రంగు మారింది. జంగిల్ క్లీరెన్స్ లేక మొక్కలు కుల్లటం వల్ల చెరువు పాడైంది. అనేక సార్లు టెండర్లు పిలిచినా పార్కు మరమ్మతులు, నిర్వహణ కార్యరూపం దాల్చలేదు. దీంతో పార్కు నిరుప యోగంగా ఉంది. మరో పక్క ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశం సైతం ఉంది. టూరిజంకు అవకాశం ఉన్న పార్కు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. పార్కును వినియోగంలోకి తీసుకురావాలని నగర ప్రజలు అనేకసార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు కోరుతున్నారు. రూ.లక్షల ఖర్చులో పార్కును మెరుగ్గా తీసుకురావచ్చు. పట్టణంలోని అన్ని పార్కులతో పోల్చితే మెరుగై పార్కు ఇది. కమర్షియల్‌గా సైతం తీర్చి దిద్దే అవకాశం ఉంది.



పిచ్చి మొక్కలు, తూటిక తివ్వతో ఆవరించిన చెరువు



విచారణకు వెళ్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద ఉత్కంఠ

- మాజీ మంత్రి సీదిరికి నోటీసులు
- 7 గంటలకు పైగా సాగిన విచారణ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద ఉత్కంఠ నెలకొంది. ఏ క్షణమైనా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అరెస్టు అయ్యే అవకాశం ఉండడంతో వైసిపి నాయకులు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శనివారం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ రాత్రి వరకూ పాటు విచారణ చేపట్టారు. ముందుగా 179 బిఎన్ఎస్ఎస్ నోటీసులు అందించి పోలీసు విచారణకు హాజరు కావాలని తెలిపారు. అందుకు కారణం వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టి గోపికు నోటీసులు ఇచ్చి ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని చెప్పారు. విషయం తెలుసుకున్న అప్పలరాజు ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్ కు వెళ్లారు. ఈ సమయంలో హంగామా చేస్తారనే అనుమానంతో పోలీసులు ఉదయం నుంచి హౌస్ అరెస్టు చేశారు. కాశీబుగ్గ సిఐ ఇంటికి వచ్చి విచారించి స్టేట్‌మెంట్ తీసుకుంటారని సమాచారం పోలీసులు నుంచి అప్పలరాజుకు వచ్చింది. అప్పటి నుంచి హౌస్ అరెస్టులోనే ఉన్నారు. కానీ, కాశీబుగ్గ సిఐ ఎప్పటికీ రాకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల పాటు అప్పలరాజు స్వయంగా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిఐ ముందు ముందు విచారణకు హాజరయ్యారు.

మండలంలోని కిష్టుపురానికి చెందిన బూర్లె విజయ్ కృష్ణంరాజు ఫిర్యాదులో భాగంగా అప్పలరాజుకు నోటీసులు అందించినట్లు తెలుస్తుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 9.30 గంటలకు విడిచిపెట్టారు. అయితే గతంలో అప్పలరాజు ఓ సంఘటనపై ప్రభుత్వ, పోలీసులు తీరుపై చేసిన వాఖ్యలపైనే ఆయనకు నోటీసు అందించి విచారిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ కేసులో బెయిల్ బుల్ సెక్షన్లు రెండు, నాన్ బెయిలబుల్ సెక్షన్లు మాజీ మంత్రిపై నమోదు చేయడంతో అప్పలరాజును విచారించి విడిచిపెట్టవచ్చని, రాత్రి వరకు విచారణ కొనసాగించి చివరి నిముషంలో అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరిచే అవకాశాలూ ఉన్నట్టు సమాచారం. మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి 9.30 గంటల వరకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎదుట వైసిపి నాయకులు పడిగాపులు కాశారు.

గ్రామాల సందర్శన తప్పనిసరి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామాన్నీ పోలీసు సిబ్బంది తరచుగా సందర్శించి వాస్తవిక, భౌగోళిక పరిస్థితులు తెలుసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. గ్రామాల పూర్తిస్థాయి సమాచారం ఉండాలని స్పష్టం చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి శనివారం సందర్శించారు. స్టేషన్ పరిధిలోని పలు ముఖ్యమైన కేసుల రికార్డులను, దర్యాప్తు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కరిం చడంలో చురుకుదనం చూపాలని, దర్యాప్తు విధానాలు పారదర్శకంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పోలీసు సిబ్బంది తరచుగా సందర్శించి సమస్యలు, తగాదాలు సృష్టించిన వారి వివరాలను ఆరా తీయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పూర్తిస్థాయి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించి గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించా లని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలిగి వారి సమస్యలపై సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలన్నా రు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిసారిం చాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి పహారా బలోపేతం చేసి ఆస్తి నేరాల నియంత్రణకు గస్తీ విధులు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వాహన తనిఖీలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు వంటి అంశాల్లో మరింత సమర్థతతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. తనిఖీలో జె.ఆర్ పురం సిఐ ఎం.అవతారం, ఎస్ఐ సందీప్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పిపిపిపై పోరాటం ఉధృతం

- 12న అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలు
- వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న ప్రజా పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేయాలని వైసిపి వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పేద విద్యార్థులకు, ప్రజలకు అన్యాయం చేసే విధంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని అన్నారు. పేదల ఆరోగ్యం, విద్య హక్కుపై చేపడుతున్న ఈ దాడిని వైసిపి పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు.. ఇప్పటికే కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపామని చెప్పారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్

నియోజకవర్గల్లో నిర్వహించే కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేయాలన్నారు. ఈ ర్యాలీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించే లా ఉండాలన్నారు.

నాయకులతో చర్చ

పోస్టర్ ఆవిష్కరణ అనంతరం కృష్ణదాస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహణపై సమీక్షించారు. ఆయా నియోజకవర్గాల్లో ర్యాలీ రూట్‌మ్యాప్, జనసమీకరణ, పోలీస్ అనుమతుల వంటి అంశాలపై చర్చించారు. ప్రజలందరికీ ఈ ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాన్ని తెలియజేసి, ర్యాలీలో పాల్గొనేలా చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ముఖ్య నాయకులు, అను బంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, శ్రీకాకుళం నియోజకవర్గ ముఖ్య నాయకులు పాలొంటారని చెప్పారు. ప్రతి కార్యకర్త్యాతీ ర్యాలీని విజయవంతం చేసి, పోరాట పటిమను చాటాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎం.వి.పద్మావతి, అంధవరపు సూరిబాబు, గేదెల పురుషోత్తం, ఎన్ని ధనంజయరావు, చిట్టి జనార్ధనరావు, చల్ల శ్రీనివాసరావు, ఎం.ఎ.బేగ్, రౌతు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నేడు బాలియాత్ర

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జలుమూరు

మండలంలోని శ్రీముఖలింగేశ్వర ఆలయం సమీపంలో ఆదివారం బాలియాత్రను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాలియాత్రకు పెద్దసంఖ్యలో యాత్రికులు హాజరయ్యే అవకాశమున్న దృష్ట్యా బారికేడ్లు, క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ యాత్ర ఆదివారం సాయంత్రం మొదలుకొని రాత్రి వరకు కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, తహశీల్దార్, డిప్యూటీ ఎంపిడిఒ, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, సర్పంచ్ తమన్నగారి సతీష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం సిటీ: రాజమండ్రి వేదికగా ఈ నెల 11న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా పిలుపునిచ్చారు. ఫెన్సింగ్ కోచ్‌లు ఇచ్చిన శిక్షణను ఉపయోగించుకుని పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని అన్నారు. శ్రీకాకుళంలోని టౌన్ హాల్ వేదికగా శనివారం బహుజన నేత డాక్టర్ కంఠ వేణు, పూర్వ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్ ఇతర అసోసియేషన్ సభ్యులతో కలిసి రాజా ఫెన్సింగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం కోచ్‌ల పర్యవేక్షణలో సీనియర్స్ విభాగం ఫెన్సింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీనియర్ విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచని క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులు శిక్షణలను అందిపుచ్చుకుని పోటీల్లో రాణించాలని కోరారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశి వ్యవహరించారు. ఈ పోటీల్లో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భవాని, సంపతిరావు నాయుడు, పిఇటి, పిడిలు, కోచ్‌లు రాహుల్, హేమంత్ ఖాన్ పాల్గొన్నారు.




తలపడుతున్న క్రీడాకారులు


బిఆర్‌ఎయులో హెర్బల్ గార్డెన్ స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సమాజహిత, ఆరోగ్యకరమైన ఔషధ మొక్కలను పది హెక్టార్లలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలో పెంచనున్నారు. దీని కోసం చేసిన హెర్బల్ గార్డెన్ ప్రతిపాదనలు పరిశీలనకు ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (విజయవాడ) అధికారులు వర్శిటీలో శనివారం వర్యటించారు. క్యాంపస్‌లో అనువైన ప్రదేశాలను వర్శిటీ ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం వర్శిటీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సైన్స్ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులనుద్దేశించి ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సిఇఒ చంద్రశేఖర్ మాట్లాడారు. ఔషధ మొక్కలు పెంచడం వల్ల భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించిన వారమవుతామన్నారు. గంజాయి వంటి సాగుకు, వ్యసనాలకు యువతరం దూరంగా ఉండి ప్రయోజకరమైన చెట్లు నాటేందుకు ముందుకు రావాలని కోరారు. బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఔషధ రంగ విద్యాభ్యాసనలో స్వల్పకాలిక కోర్సులు కూడా చేస్తే మంచి ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. తొలుత ఔషధ, సుగంధ మొక్కల బోర్డు అధికారులు వర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజనితో ఆమె ఛాంబరులో భేటీ అయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదిత హెర్బల్ గార్డెన్ తమ వర్శిటీలో త్వరతగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, పూర్వ రిజిస్ట్రార్ పి.సుజాత, అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిని, ఆర్ అండ్ డి డీన్ ఎన్.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న విసి రజని



పరిసరాలను పరిశీలిస్తున్న డిఆర్‌ఎం లలిత్ బోహరా

దూసి రైల్వేస్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలో జాతిపిత మహాత్మా గాంధీ అడుగుపెట్టిన రైల్వేస్టేషన్‌గా గుర్తింపు పొందిన దూసిని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) లలిత్ బోహరా శనివారం పరిశీలించారు. ఇటీవల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రయాణికులు ఎంతో చరిత్ర కలిగిన దూసి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రాలను అందజేశారు. కేంద్ర మంత్రి సూచనల మేరకు డిఆర్‌ఎం రైల్వే అధికారులతో కలిసి దూసి చేరుకొని రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించి రైల్వే అధికారులతో సమగ్రంగా మసీక్షించారు. దూసి రైల్వే స్టేషన్ నుంచి ప్లాట్ ఫారం రైల్వే ట్రాక్‌లు, ప్రయాణికుల విశ్రాంతి భవన సౌకర్యాలు, తాగునీరు, వసతి, లైటింగ్ సదుపాయాలు, రోడ్డు కనెక్టివిటీ వంటి అంశాలను పరిశీలించారు. అలాగే దూసి రైల్వేస్టేషన్ లో మహాత్మా గాంధీ నాటిన చెట్టును పరిశీలించి ఆ ప్రాంతాన్ని తక్షణమే పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్రమంత్రి ఆదేశాల మేరకు దూసి రైల్వేస్టేషన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించి రైల్వే ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. ఆయన వెంట రైల్వే అధికారులు పాల్గొన్నారు.

నేతల స్వలాభాపేక్షలో...

జనం ఆకాంక్షలు గల్లంతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజలకు ఒక పనిచేసి పెడితే రాజకీయంగా తమకు ఏ మేరకు లాభం కలుగుతుందో లెక్కలు వేసుకుని నిర్ణయాలు తీసుకునే రాజకీయాలు నడుస్తున్న కాలమిది. రాజకీయాల్లో బాగా ఆరితేరిన వారైతే కూడికలు, తీసివేతలతో బేరీజు వేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు రెండు ఓట్లు పడతాయంటేనే దానిపై ముందుకు వెళ్తున్నారు. తాము ఒక పని చేస్తే అది రాజకీయంగా తమకే మాత్రం ప్రయోజనకారిగా ఉండదని భావిస్తే, ఆ అంశాల జోలికి వెళ్లడం లేదు. అదే సందర్భంలో తమ ఆధిపత్యం చేజారిపోతుందని ఏమాత్రం అంచనా ఉన్నా, ఆ పని చేయడానికి ససేమిరా ఇష్టపడడం లేదు. రాజకీయ వ్యూహాల్లో ఆరితేరిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రస్తుతం జిల్లాల్లో మార్పులు, చేర్పుల ప్రక్రియలో సరిగ్గా అలాగే వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాల పునర్విభజనలో పలాస రెవెన్యూ డివిజన్‌లో ఉన్న నందిగాంను టెక్కలిలో యధావిధిగా చేర్చే ప్రతిపాదనను కేబినెట్ సబ్ కమిటీ పరిశీలనకు వచ్చేలా చేసుకున్న ఆయన, అదే సందర్భంలో జిల్లాలోని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇష్టపడలేదు. దీంతో ఆయా నియోజకవర్గాల ప్రజలు గ్రీవెన్స్‌లో ఇచ్చిన వినతులు బుట్టదాఖలయ్యాయి. మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రజల వినతులు కేబినెట్ సబ్ కమిటీ పరిశీలనకు రాకుండా పోయాయి. మంత్రుల బృందం జిల్లాలో పర్యటించి, వినతులు స్వీకరించాల్సి ఉన్నా, వారు రాకపోవడంతో తమ ఆవేదన, ఆకాంక్షలతో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతులను సమర్పించుకోవాల్సి వచ్చింది. మంత్రిగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను సమదృష్టితో చూడాలి తప్ప తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతానికి ఒకలా మిగిలిన నియోజకవర్గాల విషయంలో మరోలా వ్యవహరిస్తే అచ్చెన్నకు మేలు చేయొచ్చు గాక అది టిడిపికి మాత్రం తీవ్ర నష్టం చేయనుందనే విషయం గుర్తెరగాలి.

జిల్లాలో మార్పులు, చేర్పుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబే జిల్లాకు హోం మంత్రి అనితతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను నియమిస్తే, వారు రాకపోవడంపై అంతుచిక్కడం లేదు. ముఖ్యమంత్రి సమక్షంలో ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత వారు జిల్లాకు ఎందుకు రాలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో జిల్లా అంతర్భాగం కాదని అనుకుంటున్నారా?, వెనుకబడిన జిల్లాపై చిన్నచూపా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మంత్రుల బృందం రాకపోయినా జిల్లాల విభజన తర్వాత జనం పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకునైనా మంత్రి అచ్చెన్నాయుడు మంత్రుల బృందాన్ని జిల్లాకు రప్పించే బాధ్యత తీసుకోవాలి కదా? మార్పులు, చేర్పులతో తనకేం ప్రయోజనమని భావించే మిన్నకున్నారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు పలాస జిల్లా ఏర్పాటుపై ఉద్దాన ప్రాంతవాసుల నుంచి విపరీతమైన డిమాండ్ వినిపిస్తోంది. ఇచ్ఛాపురం నుంచి జిల్లా కేంద్రానికి రావాలంటే సుమారు నాలుగు గంటల సమయం పడుతోంది. తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్న ప్రజలు కేబినెట్ సబ్ కమిటీ ముందు తమ అవస్థలను విన్నవించుకుంటే కనీసం వారు పరిగణనలోకి తీసుకునేవారు. మంత్రుల బృందం పొరపాటున పలాస జిల్లా ఏర్పాటును పరిశీలనకు తీసుకుంటే రాజకీయంగా తమకు నష్టం వాటిల్లుతుందని మంత్రి అచ్చెన్న భావిస్తున్నారా? లేక శ్రీకాకుళం జిల్లాలో తమ కుటుంబ ప్రాబల్యం తగ్గిపోయి, కాళింగ సామాజిక తరగతి చేతుల్లోకి వెళ్లిపోతుందనే అంచనాలు వేసుకున్నారా? అంటూ జనం పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

ప్రజలకు హామీలిచ్చి ఆనక వాటిని అటకెక్కించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటే. ఎన్నికల ముందు అనేక వాగ్ధానాలను ఇచ్చి విస్మరించిన చంద్రబాబు, చివరకు జిల్లాల విభజన సమస్యల విషయంలోనూ అదే ఒరవడి కొనసాగించారు. భామిని మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలుపుతామంటూ ఎన్నికల ప్రచారం సందర్భంగా కొత్తూరు బహిరంగ సభలో మాటిచ్చారు. ఇప్పుడు అవకాశం వచ్చినా భామిని ప్రజలకు న్యాయం చేయలేదు. జిల్లాల విభజనకు ముందు నుంచి వారు పోరాడుతూనే ఉన్నారు. తమను పార్వతీపురం మన్యం జిల్లాలో కలపొద్దంటూ ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు ఇచ్చారు. మార్పులు, చేర్పులపై ప్రక్రియ మొదలైన తర్వాత తాము పడుతున్న ఇబ్బందులనూ అందరి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రుల సబ్ కమిటీలో కనీసం ఆ అంశం పరిశీలనకు రాకపోవడం వారిని కలిచివేస్తోంది. ప్రకాశం జిల్లా మార్కాపురాన్ని జిల్లాగా చేస్తానని తాను మాట ఇచ్చానని చెప్తూ, ఆ ప్రాంతాన్ని జిల్లాగా మార్చిన చంద్రబాబు సిక్కోలు ప్రజల విషయంలో ఏ ఒక్క వినతినీ పరిగణనలోకి తీసుకోకపోవడం వివక్ష చూపినట్లయింది. శ్రీకాకుళం జిల్లా టిడిపికి కంచుకోట అంటూ చంద్రబాబు, అచ్చెన్న ఒకవైపు చెప్తూనే, వారి ఆకాంక్షలపై నీళ్లు చల్లడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రజలకు ఎన్నికల ముందు హామిలిచ్చి తర్వాత ఎగ్గొట్టినా జనం త్వరగా మరిచిపోతారనే పాత రోజులు పోయాయి. నిత్య చైతన్యవంతులైన ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉంటారన్న విషయం పాలకులు ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిది.


మంత్రి లోకేష్‌కు చేనేత వస్త్రాలు చూపిస్తున్న ప్రతినిధులు

చేనేత ఉత్పత్తిదారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- బూర్జ

చేనేత వస్త్రాలు, ఉత్పత్తిదారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని విద్యాశాఖ, ఐటి మంత్రి నారా లోకేష్‌ను ప్రతినిధులు కోరారు. శనివారం విజయవాడలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ కౌన్సిల్ నిర్వహించిన ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రి లోకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందూరు ఖాది విశిష్టతను, చేనేత ఉత్పత్తిదారుల అభివృద్ధికి ప్రభుత్వ సహకార ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆర్ష్ సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు మాట్లాడుతూ ఈ కంపెనీ ఆర్ష్ సంస్థ, నాబార్డ్ సహకారంతో బుర్జ మండలంలో ఉప్పినివలస గ్రామం, ఆముదాలవలస మండలం శ్రీనివాసాచార్యులు పేటలో చేనేత కార్మికులతో ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కంపెనీ ద్వారా 500 మంది చేనేత ఉత్పత్తిదారులు పొందూరు ఖాది ద్వారా అధునాతన మోడల్స్‌తో చీరలు, డ్రెస్ మెటీరియల్, షర్ట్స్ ఫాంట్లు తయారుచేసి ఆన్‌లైన్. ఆఫ్‌లైన్‌లో మార్కెటింగ్ చేయడం జరుగుతుందని ఆయనకు వివరించారు. చిక్కోలు చేనేత ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ కంపెనీ ద్వారా ఆర్గానిక్ ఖాదీని ప్రోత్సహించడం జరుగుతుందని, మహిళలకు చేనేత కార్మికులకు అధునాతన పద్ధతుల్లో శిక్షణలు ఇచ్చి మార్ఫింగ్ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు బాగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు.

'ఐతమ్'కు రీసెర్చ్ సెంటర్ గుర్తింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

టెక్కలి ఐతమ్ కళాశాలకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ విశ్వావిద్యాలయం జివి నుంచి పరిశోధన కేంద్ర గుర్తింపు పునరుద్ధరించారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గుర్తింపు పత్రాలను జెఎన్‌టియుజివి ఉపకులపతి చేతుల మీదుగా ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, గణితశాస్త్రం విభాగాలకు సంబంధించిన ధ్రువపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావుకు శనివారం అందజేశారు. ఈ గుర్తింపు రెండేళ్లు వర్తిస్తుందని వివరించారు. ఇప్పటికే ఎంబిఎ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం విభాగాలకు రీసెర్చ్ సెంటర్లు కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ కొత్త పునరుద్ధరణతో కలిపి మొత్తం తొమ్మిది విభాగాల పరిశోధన కేంద్రాల గుర్తింపు పొందడం కళాశాల ప్రతిష్ఠను మరింతగా పెంచిందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశోధన కేంద్రం పిహెచ్‌డి, ఇతర విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన, ఆవిష్కరణ, సాంకేతిక అభివృద్ధి రంగాల్లో ముందడుగు వేయడానికి ప్రేరణగా నిలుస్తాయన్నారు. ఈ గుర్తింపు సంస్థలో పరిశోధనా సంస్కృతిని మరింతగా బలోపేతం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్య సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

డాక్టర్ 'చాపర'కు సత్కారం

ప్రజాశక్తి- ఆముదాలవలస


మాట్లాడుతున్న సుధాకర్

పట్టణంలోని ధర్మారావు క్వాటర్స్‌లో హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి సంఘ స్థాపన వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ అడ్వైజరీ మెంబర్ డాక్టర్ చాపర సుధాకర్ దంపతులకు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవరెండ్ శామ్యూల్ అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో చిన్నపిల్లల వైద్యుడిగా విశిష్ట వైద్య సేవలు అందిస్తూ డిప్యూటీ జిల్లా వైద్యాధికారిగా సేవలందించిన సుధాకర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీకి అడ్వైజరీ మెంబర్‌గా నియమించడం అందరికి గర్వకారణమన్నారు. అలాగే డాక్టర్ సుధాకర్ సతీమణి విజయలక్ష్మి బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా గుర్తింపు పొంది ప్రజలకు సమాజానికి న్యాయపరంగా విలువైన సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ అరుదైన అవకాశం ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శామ్యూల్ జాన్, డాక్టర్ మనోహర్, జోసఫ్ శ్యాంబాబు, సామ్సన్, అహరోన్ రాజ్, బోర్నో తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాలి

మెళియాపుట్టి : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని పాతపట్నం నియోజకవర్గ బిజెపి సమన్వయకర్త డాక్టర్ సలాన శరత్‌కుమార్ కోరారు. విజయవాడలోనిసివిల్ సప్లయి ఎండీ ఢిల్లీరావును ఆయన స్వగృహంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మొంథా తుపాను నేపథ్యంలో పంటలకు చాలా వరకు నష్టం వాటిల్లిందని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు. అనంతరం పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కలాం ఫౌండేషన్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

కిడ్నీ బాధితునికి అండగా నిలిచి డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు ఉదారత చాటుకున్నారు. మండలంలోని కొండిపుట్టుగకు చెందిన కొర్రాయి నీలయ్య పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆటో నడుపుతూ భార్య, ముగ్గురు పిల్లలతో కుటుంబాన్ని పోషించేవాడు. వ్యాధి తీవ్రత పెరగడంతో వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని సూచించగా, భార్య కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది. అప్పులు చేసి, గ్రామస్తులు, స్నేహితుల సహకారంతో విశాఖ సెవెన్ హిల్స్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే ప్రస్తుతం నీలయ్య, ఆయన భార్య ఇద్దరి ఆరోగ్యం క్షీణించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతినిధులు విశాఖ ఆస్పత్రిలోని నీలయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. అంతేకాకుండా దాతలు ఉదారంగా స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు.

వనభోజన మహోత్సవం

రణస్థలం: మండలంలోని నెలివాడ సెంటర్ ఆనుకొని మామిడితోటలో పైడిభీమవరం ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి కార్తీకమాస వనభోజన మహోత్సవ కార్యక్రమంలో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీకమాస వనభోజనాలతో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘం కమిటీసభ్యులు కిరణ్‌కుమార్‌కు దుశ్శాలువతో సత్కరించారు. వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, వైసిపి ఎచ్చెర్ల నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, దన్నాన హరి, జిల్లా ఆర్యవైశ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ పచ్చిగుళ్ల సాయిరామ్, ఆర్య వైశ్య కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ఆర్‌డిఎస్ విత్తనాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని రావులవలస యూనిట్ మాకివలస రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ విధానంలో రబీ అపరాలలో ఆర్‌డిఎస్ విత్తనాలు కిట్లు రైతులకు అందుబాటులో ఉండే విధంగా సిద్ధంగా ఉన్నాయని తోట రమణ తెలిపారు. రైతు సేవా కేంద్రాలు వద్ద రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రబీ డ్రై స్లోయింగ్ విత్తనాలు కిట్లులో ఉండే విత్తనాలు గోంగూర, తోటకూర, అలసంద, బెండ, గోరు చిక్కుడు, పాలకూర, కొత్తిమీర, బీర, కంది, ముల్లంగి, కట్టే జనుము 11 రకాలు విత్తనాలు రెండున్నర కేజీలు ఉంటాయని తెలిపారు. ఇవి అపరాల్లో కలుపుకొని చల్లుకోవాలని సూచించారు. ఈ విధంగా చల్లడం వల్లన అపరాలతో పాటు నెలరోజుల నుంచి ఆరు నెలల ఆదాయం వచ్చే పంటలు తీయొచ్చునని అన్నారు. బయోడైవర్సిటీ క్రాప్ చేయడం వల్లన భూసారం పెరుగుతుందన్నారు. ప్రధాన పంటకు తెగులు, పురుగుల ఆశించవుని వివిధ రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌ఛార్జి రాజేశ్వరమ్మ, ఐసిఆర్‌పి కమలమ్మ, రమాదేవి, లీలావతి, సింహాద్రిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐసిఆర్‌పిలకు శిక్షణ పూర్తి

ఎచ్చెర్ల : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్ స్కీం నుంచి గ్రామాల్లో ఎంపిక చేయబడిన ప్రకృతి వ్యవసాయ ట్రైనీ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు మొదటి విడతగా ఐదురోజుల శిక్షణా తరగతులను ఎచ్చెర్ల టిటిడిసిలో పూర్తి చేయడం జరిగిందని డిపిఎం పూజారి సత్యన్నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ ఈ శిక్షణలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పంటల్లో ఉపయోగించాల్సిన జీవామృతం, కషాయాలు అలాగే ఎటిఎం, ఎ-గ్రేడ్ మోడల్స్‌పై క్షుణ్ణంగా తరగతులను నిర్వహించామన్నారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఫుడ్, మోడల్స్‌ను క్షేత్రస్థాయిలో డెమో చేయించి చూపించడం జరిగిందని, ఈ శిక్షణ పొందిన వారికి కేటాయించిన గ్రామాల్లో మొదటగా వారి క్షేత్రాల్లో ప్రకృతి వ్యవసాయ మోడల్స్‌ను ఉపయోగించి పంటలను సాగు చేసుకుని మిగతా రైతులను కూడా ఆదర్శంగా తయారు చేసుకుని రైతులతో ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిగా విస్తరింప జేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరూ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు.


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న డిపిఎం సత్యనారాయణ


కమిటీ సభ్యులకు శిక్షణ

కొత్తూరు: వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం అటవీ వనరుల నిర్వహణ కమిటీ సభ్యులకు సంస్థ కార్యదర్శి బి.సంజీవరావు శిక్షణ ఇచ్చారు. కమిటీ సభ్యులకు, ఆదివాసీలకు ఉన్న సంబంధం, వారి జీవన విధానం, జీవన విధానంలో మార్పులు, అటవీ హక్కుల చట్టం, సాగుహక్కుదారులకు సంక్రమించే అటవీ హక్కులు గురించి వివరించారు. ఈ శిక్షణలో రిసోర్స్‌పర్సన్‌గా ఎ.చిరంజీవిరావు, ఎ.నాగరాజు, బి.వెన్నెల, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసింగిలో అన్నదానం

కొత్తూరు : మండలంలోని కర్లమ్మ పంచాయతీ మహాసింగిలో ఉన్న వరహాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ప్రాంగణంలో శనివారం అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి మూడు వేల మంది వరకు యాత్రికులు పాల్గొన్నారు. అలాగే ఆప్తాలమిక్ వైద్యాధికారి ఐ.జానకి రామయ్య నేత్ర వైద్య శిబిరం నిర్వహించి నేత్రాలను పరీక్షించారు. అనంతరం రాత్రి లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోగుల వరప్రసాదరావు నాయుడు, లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, భానుమూర్తి పాల్గొన్నారు.

ఎఇగా రామ్‌చరణ్ గుప్త


రామ్‌చరణ్ గుప్త

నరసన్నపేట: నరసన్నపేట పట్టణం ఎలక్ట్రికల్ ఎఇగా రామ్ చరణ్ గుప్త శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విశాఖలో విధులు నిర్వహిస్తూ బదిలీ ఇక్కడకు వచ్చానని తెలిపారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎఇ కోటేశ్వరరావు కోటబొమ్మాళి బదిలీపై వెళ్లారు.

వెంకటేశ్వరస్వామి ఆలయం సందర్శన


ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గలో ఉన్న వెంకటేశ్వర ఆలయంలో ఈ నెల 1న తొక్కిసలాటలో 9 మృతి చెందగా, పలువురు గాయపడిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న దేవాదయ, ధర్మాదయశాఖ మాజీ ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ శనివారం ఆలయాన్ని సందర్శించారు. తొక్కిసలాటలో 9 మంది మృతి చెందిన సంఘటనపై ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతరం ఆలయం ధర్మకర్త ముకుంద పండాతో మాట్లాడారు. ఆయనతో పాటు టి.కామేశ్వరి, ఐ.వి.అప్పారావు ఉన్నారు.


ఎంపికైన విద్యార్థులు

సత్యసాయి విద్యార్థులకు అభినందన

ఇచ్ఛాపురం : రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు సత్య సాయి పాఠశాల విద్యార్థులు ఎంపిక ఎంపికయ్యారని యజమాని భానుతేజ, ప్రిన్సిపాల్, పీడీ తెలిపారు. ఈ మేరకు స్కూల్ యజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ... శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలో పాల్గొంటారని అన్నారు. పి.ప్రణీత్, లాస్యశ్రీ ప్రధాన్, ధనుష్, నవీన్ ఆచారి, కాళ్ల జీవన్ ఎంపికైన వారిలో ఉన్నారని తెలిపారు. ఈ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.


రోడ్డు పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

గోతుల రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ప్రగడపుట్టుగ నుంచి జల్లుపుట్టుగ వెళ్లే గోతుల రోడ్డును సర్పంచ్ పూడి లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎంతో ముఖ్యమైన ఈ రహదారిలో ముందుగా జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించి రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చే ఏర్పాటు చేస్తానని తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ సహకారంతో పక్కా రహదారి నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామంలో 25 ఏళ్ల క్రితం వేసిన సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పి.ఎం.జె బాబు ఆదర్శం

శ్రీకాకుళం సిటీ: అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి పిఎంజె బాబు అని పలువురు రాజకీయ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల వక్తలు పేర్కొన్నారు. శనివారం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పిఎంజె బాబుకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి శంకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, టిడిపి సీనియర్ నాయకులు మొదలవలస రమేష్, వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర పాల్గొన్నారు.

పిపిపికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ


నరసన్నపేట : మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేరిస్తున్నామని వైసిపి జిల్లా ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంతకాల సేకరణలో భాగంగా రైతులు, వర్తకులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, ఆటో డ్రైవర్లు పాల్గొని సంతకాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళిధర్, రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణారావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని హనుమంతునాయుడుపేట, ఆకాశలక్కవరం, యామాలపేట పంచాయతీల్లో వైసిపి నాయకులు శనివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బుడ్డ మోహన్‌రెడ్డి, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, వైస్ ఎంపిపి నక్క భీమరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కింతలి, కనిమెట్ట, వి.ఆర్.గూడెం గ్రామాల్లో శనివారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటిసంతకాల సేకరణను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి నాయకులు చింతాడ సత్యప్రసాద్, పైడి నాగభూషన్, గుడ్లమోహనరావు, గాడు ఆగరాజు, సూర్యారావు, గంగాధర్, సూర్యనారాయణ, తేజేశ్వరరావు, ఆన ఒదరావు, లోకనాథం, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కొత్తూరు

జిల్లా మున్సిపల్ మైదానంలో ఈ నెల 11 నుంచి సిక్కోలు పుస్తక మహోత్సవం, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక, కళా సంబరాలు నిర్వహిస్తున్నామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, న్యాయవాద సంఘాల నాయకులు ఎం.అప్పారావు, డి.ప్రకాష్, డి.సురేష్, పి.రమేష్, అరుబోలు ధర్మారావు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సిక్కోలు పుస్తక మహోత్సవం విజయవంతం పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంబరాల్లో జానపద కళా ప్రదర్శనలు, తప్పెటగుళ్లు, కోలాటం, జముకులపాట, ఎరుకుల పాట, ధిరస్సా నృత్యం, సంప్రదాయ కళారూపాలు, నృత్యాలు, ఏక పాత్రాభినయాలు, సంగీత, గాన ప్రదర్శనలు, నాటికలు, పాశ్చాత్య నృత్యాలు నిర్వహిస్తారని అన్నారు. అలాగే స్కూళ్ల విద్యార్థులకు వేదిక వద్దే చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టి.గణపతిరావు, చింతాడ ప్రసాద్, నిమ్మక అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నగరంపల్లి పాఠశాల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న నేపాల్ బృందం

వజ్రపుకొత్తూరు: నేపాల్ దేశానికి చెందిన సోషల్ సర్వీస్ సెంటర్ ఆరుగురు సభ్యుల బృందం వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న ఇఎండిపి (వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం) అధ్యయనం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులను చూసి అభినందించారు. ఇవి విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం కనుక్కొని సమాజాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారిని వ్యవస్థాపకులుగా మార్చే దిశగా రూపొందించినది ఈ కార్యక్రమమని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తలగాన హేమరావు, ఇఎండిపి జిల్లా మేనేజర్ అనూష, నేపాల్ దేశ బృంద సభ్యులు హిరసింగ్ తాప, మాధవ్ భట్టారి, మాయ అధకారి, మేనక చట్టేరి, జీబ్‌రాజ్ రెగ్మి, సమీక్ష్య రెగ్మి, ఎస్ఎంసి చైర్మన్ బి. లక్ష్మీపతి, ఇఎండిపి ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బివికెలో సప్తశక్తి సంగమం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బివికె పాఠశాలలో శనివారం సప్తశక్తి సంగమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దేశంలో ప్రస్తుత పరిస్థితులు పరిష్కరించడంలో మహిళలు, యువత బాధ్యతను సప్తశక్తి సంఘం ద్వారా వివరించారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో పిల్లల పెంపకం, స్త్రీ పాత్ర తదితర అంశాలపై బి.హరిణి, ఎస్.నీరజ, బి.జాహ్నవి, వి.విహారిక, అశ్విక, ఎస్.దీక్షిత, లక్ష్మి, బి.మణి తదితరులు మాట్లాడారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన పి.లక్ష్మమ్మ, ఎల్.హరిప్రియను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పొందల జానకరామయ్య, హెచ్ఎం రవిచంద్ర, పాఠశాల సిబ్బంది విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న ప్రదర్శన

కార్యకర్తకు అండ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు


మెళియాపుట్టి : టిడిపికి సేవలందిస్తున్న కార్యకర్త కుటుంబానికి ఆపదలో అండగా నిలస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని సింగపురం పంచాయతీ లాభరకు చెందిన కనపల మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం పరామర్శించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి సభ్యుడిగా రూ.వంద చెల్లించడంతో ప్రమాద బీమా చేయించుకున్న నేపథ్యంలో టిడిపి తరుపున రూ.5 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హిరమండలం ఎంపిపి ప్రతినిధి తూలుగు తిరుపతిరావు, పాతపట్నం మండల టిడిపి అధ్యక్షులు పైల బాబ్జి, పాతపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, సైలాడ సతీష్, ఉర్లాన వసంత్ పాల్గొన్నారు.

విద్యార్థికి 'పద్మావతి' ఆసరా

నరసన్నపేట: స్థానిక పద్మావతి విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. పద్మావతి జూనియర్ కళాశాలలో చదువుతున్న కోరాడ సాయిమణికంఠకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా శస్త్ర చికిత్స చేశారు. శస్త్ర చికిత్స అనంతరం అవసరమైన మందులు ఖర్చుల కోసం పద్మావతి విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం ఏర్పాటు చేసుకున్న ఆసరా నిధి నుంచి రూ.22 వేలు శనివారం కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ బాధిత కుటుంబానికి అందజేశారు. విద్యార్థి త్వరగా కోలుకోవాలని కోరారు. కళాశాల ప్రతినిధులు శ్రీనివాస్, నాయుడు, రాము పాల్గొన్నారు.

భక్త కనకదాసు జయంతి

శ్రీకాకుళం సిటీ: భక్త కనకదాసు రచనలు సమాజంలో ప్రభావం చూపాయని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి అన్నారు. భక్త కనకదాసు 516వ జయంతి వేడుకలు సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందజేస్తున్న రామకృష్ణారావు

అనాథలకు ఆసరా

సరుబుజ్జిలి: మండలంలోని ఎల్.పి.ఎం. అగ్రహారం గ్రామానికి చెందిన యువకుడు తంగి రామకృష్ణారావు అనాథలు, నిరుపేదలకు అండగా నిలుస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో ఆర్థికంగా స్థిరపడిన ఆయన స్వగ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇటీవల తెలికిపెంట గ్రామానికి చెందిన నిరుపేద ఆటో డ్రైవర్ నడిమింటి ఉగాది రామకృష్ణారావు అనే వ్యక్తి పక్షవాతం బారిన పడి మంచానికే పరిమితమవడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. శనివారం అదే గ్రామానికి చెందిన రోజు కూలీ పైల జనార్ధనరావు మూడు నెలలుగా అనారోగ్యంతో పనులు చేయలేని స్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న ఆయన ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు బియ్యం, నూనె తదితర సామగ్రితో పాటు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ తనకు ఉన్న దానిలో సమాజంలోని పేదవారికి ఉపయోగపడే విధంగా వినియోగించుకుంటానన్నారు. ఎంత చిన్నదైనా చేయూత అందించడం తన కర్తవ్యంగా భావిస్తానని తెలిపారు. రామకృష్ణారావు చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్తులు, స్నేహితులు, సమీప ప్రాంతాల ప్రజలు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి-నౌపడ రోడ్డులో రాజగోపాలపురం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇజ్జువరపు అప్పన్న (45) మృతి చెందాడు. మృతుడు రాజగోపాలపురం గ్రామస్తుడిగా స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న టెక్కలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవపంచనామా నిర్వహించారు. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు బలవన్మరణం


వెంకటరావు (ఫైల్)

నందిగాం : మండలంలోని దేవిపురం పంచాయతీ తురకలపేటకు చెందిన మేఘవరం వెంకటరావు (33) శనివారం బలవన్మరణానికి పాల్పడాడ్డు. పోలీసుల కథనం మేరకు... మృతుడు వజ్రపుకొత్తూరు మండలం బెండి గేట్ వద్ద ఉన్న పెట్రోల్ బంకు యజమాని బగాది రమేష్ వద్ద రూ.30 వేలు రుణం తీసుకున్నాడు. ఆ రుణం వెంకటరావు తీర్చలేదని శుక్రవారం రాత్రి రమేష్ ఆయన ఇంటికి వచ్చి రభస చేశారు. దీంతో వెంకటరావు మనస్తాపానికి గురై గ్రామానికి సమీపంలో ఉన్న తోటలో చెట్టుకు తాడు బిగించి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడిడికి భార్య నీలమణి, కుమార్తె హిమబిందు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుజరాతి పేటకు చెందిన ఐటిఐ చదువుతున్న విద్యార్థి అలుగోలు సాయి నేతాజీ వంతెన పైనుంచి నాగావళి నదిలో దూకేశాడు. రెస్క్యూ టీంలు గాలిస్తున్నారు. ఆచూకీ లభ్యం కాకపోవటంతో రెండు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మి చెప్పారు.

కెజిబివి సిబ్బందిపై కేసు నమోదు

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివిలో రెండు నెలల క్రితం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విద్యార్థిని ఫిర్యాదు మేరకు శనివారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్య నారాయణ తెలిపారు. కెజిబివి ప్రిన్సిపాల్ ఎస్.లలిత కుమారి, సమగ్ర శిక్ష ఎపిసి శశిభూషణరావు తనను కులంపేరుతో దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడడంతో తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.


భద్రతా ఏర్పాట్లుపై మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

వైభవంగా వెంకటేశ్వర కళ్యాణం

పొందూరు: మండలం రాపాక గ్రామంలోని కొండపై వెలసిన శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం మూడో శనివారం పురష్కరించుకుని స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమానికి సుమారు 5వేల మందికి పైగా యాత్రికులు తరలివచ్చారు. దీంతో ఆలయంలో ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తుతో పటిష్టమైన భద్రతను కల్పించారు. అలాగే కొండపైకి వాహనాల రాకపోకలను నియంత్రించారు. కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట చోటుచేసుకున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లును చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు వి.సత్య నారాయణ, బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

రణస్థలం: రణస్థలం హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రణస్థలం నుంచి ప్రారంభమై పైడిభీమవరం, కోష్ఠ, సుభద్రాపురం తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారిపై రోడ్ పక్కన ఉన్న నిరాశ్రయులైన పేదవారికి చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని దుప్పట్లు, బట్టలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ దుప్పట్లు పంపిణీ చేయడంతో నిరాశ్రయులైన పేదవారు చాలా సంతోషం వ్యక్తం చేసారని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాకుళం సిటీ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం వందేమాతరం 150 సంవత్సరాలు సంస్మరణ వేడుకుల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది రక్తదానం చేశారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు చెప్పారు. రక్తదానం చేయ్యండి - ప్రాణదాతలు కండి అనే నినాదంతో శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణపై అవగాహన

కవిటి: మండలంలోని కపాసుకుద్దిలో శనివారం సాయంత్రం సముద్ర తాబేళ్ల సంరక్షణపై మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రోజు రోజుకి తాబేళ్ల సంఖ్య తగ్గిపోతుండటంతో వాటి రక్షణ అవసరమని ట్రీ ఫౌండేషన్ సభ్యులు, అటవీశాఖ అధికారులు, సముద్ర తాబేళ్ల సంరక్షణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తాబేళ్లు వలలో చిక్కినప్పుడు వాటిని ఎలా రక్షించాలి, సురక్షితంగా సముద్రంలోకి ఎలా విడిచిపెట్టాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ జిల్లా కో్ఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు, తాబేలు సంరక్షణ సభ్యులు కుమారు, బడే లోకనాథం పాల్గొన్నారు.